క్లుప్తంగా

భూ సమస్య పరిష్కారానికి హామీ



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో, తహసీల్దార్

భీమిని: మండలంలోని జజ్జరవెల్లి గ్రామానికి చెందిన అడె లస్మ మేర తమ వంశపరంగా వచ్చిన సర్వే నంబర్ 206లో గల 16ఎకరాల 3గుంటల భూమిని సాగు చేసుకుంటున్నాడు. అడె లస్మ మేరకు సంబంధించిన భూమి 1996నుంచి తనకు తెలియకుండానే డాక్యుమెంటేషన్ రిజిస్ట్రేషన్ ఇప్పటి వరకు తొమ్మిది మందికి మారింది. ఈ విషయంపై 30సంవత్సరాలుగా లస్మ మేర అతడి ఇద్దరు సోదరులు అర్జు మేర, మల్లు మేరలు తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు అర్జీలు పెడుతూ వచ్చారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఆర్డీవో హరికృష్ణకు సమస్యను విన్నవించగా మంగళవారం ఆయన, తహసీల్దార్ శ్రవణ్‌కుమార్‌తో కలిసి సుమారు ఐదు కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లి సమస్యను పరిశీలించారు. సర్వేయర్‌తో హద్దులు ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేరాల నియంత్రణకు 'కమ్యూనిటీ కాంటాక్ట్'



మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

తాండూర్: నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగళవారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటింటా పోలీసులు సోదాలు నిర్వహించారు. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని 50ద్విచక్ర వాహనాలు, 10ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాదారం, తాండూర్ ఎస్సైలు సౌజన్య, కిరణ్‌కుమార్, మాదారం వాసులు పాల్గొన్నారు.

కార్మికులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: ఎన్నికల సందర్భంగా సింగరేణి కార్మికులకిచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సెక్రెటేరియెట్ సభ్యుడు డి.బ్రహ్మానందం అన్నారు. ఈ నెల 20న చేపట్టే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక రాజీవ్‌చౌక్‌లో మంగళవారం ప్రచారం చేపట్టారు. నాయకులు మల్లన్న, జ్యోతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

కాసిపేట: కార్మికుల విధుల గైర్హాజర్‌తో కంపెనీతో పాటు కుటుంబాలకు నష్టం జరుగుతుందని కాసిపేట-2 గని మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. గని కార్యాలయంలో మంగళవారం 16మస్టర్లు నిండని అండర్‌గ్రౌండ్, 20మస్టర్లకు తక్కువ ఉన్న సర్ఫేస్ కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి భార్గవ్, ఏఐటీయూసీ గని ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

చెన్నూర్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కరీంబీ అన్నారు. మండల వనరుల కేంద్రం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో సమ్మక్క, ఈశ్వరి, మౌనిక, ముజిత పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు

జన్నారం: ఫైలేరియా(బోదకాలు)వ్యాధి నిర్ధారణ నివారణలో భాగంగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి మండలంలోని తపాలాపూర్‌లో 300మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. బోదకాలు వ్యాధి వ్యాప్తి గురించి అవగాహన కల్పించారు.

స్పందించారు..క్యూరింగ్ చేశారు



మందమర్రిరూరల్: మందమర్రి మండలం చిర్రకుంట శివారు తుర్కపల్లిలో రోడ్డు వేసి క్యూరింగ్ చేయకపోవడం తో ×రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు€ అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా రోడ్డుపై ఇసుక కట్టలుగా పోయించి, వాటర్ క్యూరింగ్ చేయించారు.

సాక్షి ఎఫెక్ట్..

ప్రకృతివనం.. కళావిహీనం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామపంచాయతీలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో మొక్కలు లేకుండా కళావిహీనంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో చెరువు పక్కనే పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు ప్రకృతివనంలోని చెరువు నీరు వెళ్లడంతో మొక్కలు పూర్తిగా మునిగిపోయి చనిపోయాయి. దీంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ప్రకృతి వనంలో మొక్కలు లేకుండా బోర్డు మాత్రమే మిగిలింది.



మట్టి పోశారు.. చదును చేశారు



కోటపల్లి: పార్‌పల్లి గ్రామంలో 'బోరు చుట్టూ మురుగు' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. బోరు చుట్టూ మురుగునీరు నిలిచి ఉండకుండా మట్టి పోసి చదును చేశారు. మురుగునీరు తొలగించేలా కృషి చేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల జాతర



బోనాలు సమర్పిస్తున్న భక్తులు



బోనాలతో గౌడ కులస్తుల ఊరేగింపు

రామకృష్ణాపూర్: రేణుకా ఎల్లమ్మ బోనాల జాతరను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక రాజీవ్‌చౌక్ లోని గౌడ సంఘం జెండా నుంచి పాత చెక్‌పోస్ట్ ఎల్లమ్మ ఆలయం వరకు బోనాలతో తరలివెళ్లి అక్కడ ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ జాతరలో మహిళలు, గౌడ సంఘం కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్: ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని, ఈ నెలాఖరుకి 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ముదిగుంట గ్రామపంచాయతీని మంగళవారం ఆయన సందర్శించారు. పారిశుధ్య పనులను, నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతిబాపురావు, పంచాయతీ కార్యదర్శి సురేశ్ తదితరులు ఉన్నారు.

డిజిటల్ బోధనపై అవగాహన



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

దండేపల్లి: ప్రతీ ఉపాధ్యాయుడు డిజిటల్ బోధనపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి పాఠశాలకు ఐఎఫ్‌పీ బోర్డులు ఇచ్చిందని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులకు డిజిటల్ బోధన చేస్తే, విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందన్నారు. హెచ్ఎం మురళీధర్, శిక్షకులు సతీష్, శ్రీకాంత్, అంకూస్, వినోద్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎఫ్ ప్యానల్లతో విద్యార్థులకు బోధించాలి

జైపూర్: పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్లతో విద్యార్థులకు బోధించాలని మండల విద్యాశాఖ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానల్లను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, భీమారం మండలాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, రిసోర్స్ సభ్యులు రామకృష్ణ, ప్రసాద్ రావు, విగ్నేశ్, రమేశ్, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మాట్లాడుతున్న బొజ్జు పటేల్

జన్నారం: త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా విద్యావంతుడికి కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించిందన్నారు. విద్యావేత్తను గెలిపిస్తే పట్టభద్రులకు అండగా ఉంటాడని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, శుభాష్‌రెడ్డి, రియాజోద్దీన్, శంకరయ్య, ఇసాక్, ఇందయ్య, రమేశ్, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్యే

దండేపల్లి: ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్‌నాయక్‌ను దండేపల్లి మండలం లింగాపూర్‌లోని ఆయన నివాసంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దంపతులిద్దరిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

కొనసాగుతున్న హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాల వద్ద హోమం, పూజలు కొనసాగుతున్నాయి. విశ్వ శాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా మంగళవారం కృష్ణ జ్యోతి స్వరూపానందస్వామి ఆధ్వర్యంలో శ్రీ సుబ్రహ్మణ్య హనుమాను హోమములు, ఆంజనేయ స్వామికి మన్యుసూక్త సంపుటితో లక్ష తమలపాకుల అర్చన కార్యక్రమం నిర్వహించారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి మనుగడ

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థ లాభాల బాటలో పయనించేలా ప్రతీ ఆర్టీసీ ఉద్యోగి, సిబ్బంది సమష్టిగా కృషి చేసినప్పుడే మనుగడ సాధ్యమని మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్ అన్నారు. మంగళవారం మంచిర్యాల డీవీఎం కార్యాలయంలో పవర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. సంస్థ అభివృద్ధి, ఆదాయమార్గాలు, డీజిల్ ఆదా తదితర అంశాలపై కండక్టర్, డ్రైవర్లు, గ్యారేజ్ కార్మికులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. మానసిక ఉల్లాసానికి నృత్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన నాణ్యతగా చేపట్టాలి

- డీఈవో యాదయ్య



నోట్‌బుక్స్ తనిఖీ చేస్తున్న డీఈవో యాదయ్య

భీమారం: మండలంలోని పోతన్‌పల్లి, నర్సింగపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం డీఈవో యాదయ్య ఆకస్మికంగా సందర్శించారు. విద్యాబోధన నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. పోతన్‌పల్లి పాఠశాలలో పిల్లల అభ్యాసన ఫలితాలను పరీక్షించారు. విద్యార్థులకు పలు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. విద్యార్థులు సరైన సమాధానాలు ఇవ్వడంతో డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. పోతన్‌పల్లిలో విద్యార్థుల సంఖ్య పెంచితే, మరో టీచరుని నియమించనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం నర్సింగాపూర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.

ఎస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నస్పూర్: ఎస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.నర్సింగ్ అన్నారు. శ్రీరాంపూర్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా తలారి రాజు

షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాంపూర్‌కు చెందిన తలారి రాజును ఎన్నుకున్నారు. నియోజకవర్గం అధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన గుమ్ముల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడిగా శీలం రంజిత్‌కుమార్‌కు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్ట రవి, చెవుల వాసు, తరాల విజయ్, రాజలింగు, రాములు, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'యాదగిరి శేఖర్‌రావుకే ట్రస్మా మద్దతు'

జన్నారం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, సత్తన్న మండల ప్రధాన కార్యదర్శి కస్తూరి సతీష్ కుమార్, నాయకులు అంజిత్‌రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్ విస్తృత ప్రచారం

రామకృష్ణాపూర్: గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ మంగళవారం పట్టణంలో విస్తృత ప్రచారం చేపట్టారు. స్థానిక ఆయా ప్రైవేట్ పాఠశాలలతో పాటు సూపర్‌బజార్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజరమేష్, బడికల సంపత్, రామిడికుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

'అశోక్‌కుమార్‌ను గెలిపించండి'

చెన్నూర్: కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన అశోక్ కుమార్‌ను గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన రాజకీయాలను ఓడించి, ప్రశ్నించే గొంతుకను గెలిపించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.చక్రపాణి, రాజావేణు, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ రోడ్డు 1లో గల కిడ్జీ ఎలిమెంటరీ స్కూల్‌లో ఈ నెల 22న మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాజీ చందరంగం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండి సిరాజ్ ఉర్ రహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

పరీక్షల సన్నదతపై దృష్టి సారించాలి

జన్నారం: పరీక్షల సమయంలో ఇతర విషయాలపై కాకుండా, కేవలం పరీక్షల సన్నద్ధతపైనే దృష్టి సారించాలని, రోజువారి ప్రణాళిక ఏర్పర్చుకొని విలువైన సమయం వినియోగించుకోవాలని మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్టు ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాదవత్ ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒత్తిడిని అధిగమించి పరీక్షల్లో మంచి మార్కులు ఎలా పొందాలనే అంశాలపై, కెరీర్ గైడెన్స్‌పై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరాజం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాథోడ్ గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూర్ విద్యార్థులకు అవార్డులు

చెన్నూర్: సూచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు ప్రతిభ పరీక్షల్లో చెన్నూర్ లయోల, రైజింగ్‌సన్ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ లలితా కళాతోరణంలో సోమవారం జరిగిన అవార్డు ఫంక్షన్‌లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సినీనటుడు రఘుబాబు చేతుల మీదుగా విజేతలు అవార్డులు అందుకున్నారు. లయోల పాఠశాల విద్యార్థిని ప్రదీప్త రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, ఎస్ సన్విక్, రితీశ్, సుందష్, కౌశిక్, రైజింగ్ సన్ విద్యార్థిని బజ్జురి హాసిని, సంతోషిని, ఆర్మనోద్దీన్‌లు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి అవార్డులు అందుకున్నట్లు సూచిర్ ఇండియా జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కార్యదర్శుల మండల కార్యవర్గం

నెన్నెల: గ్రామపంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గాన్ని ఎంపీవో శ్రీనివాస్ అధ్యక్షతన, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్.సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, గౌరవ అధ్యక్షుడిగా పద్మనాభం, కోశాధికారిగా లక్ష్మి, ఉపాధ్యక్షులుగా రంజిత్, సరిత, సంయుక్త కార్యదర్శులుగా మధుసూదన్, స్రవంతి ఎన్నికయ్యారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత

నస్పూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో డీవైజీఎం(ఐఈడి) చిరంజీవులును మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్‌కుమార్ కలిశారు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించడానికి సహకరించిన ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ప్రమోషన్ పత్రాలను చిరంజీవులు చేతుల మీదుగా ఉద్యోగులకు అందజేశారు.

'వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకండి'

వేమనపల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారి వీరన్న తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు హాజరై సలహాలు తీసుకోవాలన్నారు.

పశువుల పాకల పరిశీలన

భీమారం: ఈజీఎస్ నిధుల ద్వారా రైతుల పశువులకు నిలువ నీడ కల్పించేందుకు పశువుల పాకలు నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూధన్ తెలిపారు. మండలంలోని పోలంపల్లిలో రైతులు నిర్మించుకున్న పశువుల పాకలను మంగళవారం ఈజీఎస్ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఇందులో ఏపీవో జీనత్, ఈసీ శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నక్కరాజన్న పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం ఈ నెల 20న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ కోరారు. బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఆవరణలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు కృష్ణవేణి, వెంకటి, బాను, శ్రీనివాస్, భూమయ్య పాల్గొన్నారు.

కులగణన రీ సర్వేలో బీసీలు పాల్గొనాలి

పాతమంచిర్యాల: కులగణనలో బీసీలు అందరూ పాల్గొని బీసీల జనాభా శాతాన్ని నిరూపించుకోవాలని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు వెంకటయ్య, అర్కాల ఓదేలు, సమ్మయ్య, ఎండీ లతీఫ్, బిరుదు పోషం, మల్లేష్, గణేష్ పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి

పాతమంచిర్యాల: తెలుగు భాషాభివృద్ధి, బడుగుల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతిని జిల్లా కేంద్రంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిళి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి సర్జికల్ మిషన్ అందజేత

చెన్నూర్: చెన్నూర్ ఆసుపత్రికి జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ సర్జికల్ మిషన్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకటనర్సయ్య, ఆసుపత్రి వైద్యులు సత్యనారాయణ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లిలో కొర్తె సుధాకర్‌కు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధం అయ్యింది. మంగళవారం బాధిత కుటుంబానికి చెన్నూర్‌కు చెందిన సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వాహకులు దుస్తులు, బోళ్లు, బెడ్‌షీట్లు అందజేశారు. స్థానిక యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు నిత్యావసర సరుకులు అందజేశారు.

దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్

చెన్నూర్: దివ్యాంగులకు త్వరలో ఉపకరణాలు అందజేస్తామని జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ అన్నారు. స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్లో మంగళవా రం అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగు రకాల వైకల్యాలు కలిగిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేస్తామన్నారు. 260 మంది హాజరయ్యారని తెలిపారు. చెన్నూర్ సీడీపీవో మనోరమ, మంచిర్యాల సీడీపీవో, అలింకో సభ్యురాలు విజయలక్ష్మి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్జానాబేగం, డీసీఎం సౌజన్య, సూపర్‌వైజర్లు, డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల: బెల్లంపల్లి నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు బుధవారం బెల్లంపల్లిలో ఉచితంగా పంపిణీ చేసేందుకు జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవేందర్ రెడ్డి తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి కళావేదికలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఈ సహాయ ఉపకరణాలు అందజేస్తారన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీలోని రైతువేదిక వద్ద ఈ నెల 20న దివ్యాంగుల క్యాంపు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.